## ధరణి దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ధరణి పెండింగ్ అర్జీలను స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కరించడానికి రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైందని కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నాటికి జిల్లాలో సుమారుగా 10,400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చిన దరఖాస్తులు మొత్తం సుమారుగా 14వేలు వచ్చాయన్నారు. ఇప్పటివరకు సుమారుగా 10వేల దరఖాస్తులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. సోమవారం నుంచి అన్ని తహసీల్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిబ్బంది సమయపాలన పాటించాలి

**- జడ్పీ సీఈవో ఎల్లయ్య**

రామాయంపేట, సెప్టెంబర్ 20: ప్రభుత్వ శాఖల్లో పని చేసే సిబ్బంది సమయపాలన పాటించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. శుక్రవారం రామాయంపేటకు విచ్చేసిన ఆయన ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.రికార్డులను ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి పంపించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడేను నిర్వహించాల న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. తడి, పొడి చెత్తన వేర్వేరుగా డంపుయార్డుకు తరలించాలన్నారు.

## మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు



ఖాళీ బిందెతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

నర్సాపూర్, సెప్టెంబర్ 20: మున్సిపాలిటీలోని 6, 7వ వార్డుల్లో మిషన్ భగీరథ నీరు రాక తలెత్తిన నీటి ఎద్దడిని తీర్చాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ ఇంటి ముందర ఖాళీ బిందెతో నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని వారు తెలిపారు. కాలనీల్లో సింగిల్ ఫేజ్ మోటర్లు కూడా లేవని, నల్లాలపైనే ఆధారపడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ మాట్లాడుతూ నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మహిళలకు తెలిపారు.

## రూ.35వేలతో బోర్‌మోటర్ అందజేత



శివ్వంపేట, సెప్టెంబర్ 20: కొంతాన్‌పల్లిలోని 2వ వార్డులో నీటి సమస్య ఉండడంతో పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి రూ.35 వేలు సొంత ఖర్చులతో సింగల్ ఫేస్ మోటర్ అందించి నీటి సమస్య పరిష్కరించారు. ఆయనతో నాయకులు ఆకుల నర్సిములు, వడ్ల లక్ష్మణ్‌చారి, చింతల దుర్గారెడ్డి, చింతల ప్రభాకర్‌రెడ్డి, గొల్ల యాదగిరి, పోచయ్య, రాము, లక్ష్మణ్, కృష్ణ ఉన్నారు.

## పిడుగు పడి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 20: మండలంలోని అంబాజినపేటలో వర్షం లేకున్నా ట్రాన్స్‌ఫార్మర్‌పై శుక్రవారం పిడుగు పడి దగ్ధం కావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం ఉరుములు వచ్చాయి. ఒక్కసారిగా పెద్ద శబ్ధం రావడంతో గ్రామస్తులు బయటకు పరుగులు పెట్టారు. పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్నట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడి మంటలు వ్యాపించాయి. వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్‌ను పునఃరుద్ధరించడానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పనులు చేపట్టారు.

## బాలికలకు మండల స్థాయి క్రీడలు



వెల్దుర్తి, సెప్టెంబర్ 20: వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు మండల స్థాయి క్రీడాపోటీలను శుక్రవారం నిర్వహించారు. అండర్-14, 17 విభాగాలలో ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించగా గెలుపొందిన బాలికలకు హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 20: మండలంలోని జంగారాయికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శ్యాం తల్లి లక్ష్మమ్మ అనారోగ్యం తో ఆదివారం మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు.

## ధరణి సమస్యల పరిష్కారానికి కృషి

రేగోడ్, సెప్టెంబర్ 20: ధరణి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన నరేశ్ తెలిపారు. ఇటీవల పని చేసిన తహసీల్దార్ బాలలక్ష్మిని కలెక్టర్ సస్పెన్షన్ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం తహసీల్దార్‌గా నరేశ్ బాధ్యతలు చేపట్టారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని, అందులో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయనతో ఆర్‌ఐ ఫిరోజ్, సిబ్బంది ఉన్నారు.

## పదో తరగతి ర్యాంకర్లకు నగదు అందజేత



చిలిపిచెడ్, సెప్టెంబర్ 20: చండూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో చౌటకూరి రాంచెంద్రారెడ్డి ట్రస్ట్ (చైతన్యరెడ్డి, జైరాంరెడ్డి) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభ కనబర్చిన వి ద్యార్థులకు నగదు అందజేశారు. 2022-23లో వై.కావ్య (మొదటి స్థానం)కు రూ.6 వేలు, డి.మానస(రెండో స్థానం)కు రూ.5 వేలు, 2023-24లో ప్రవళిక(మొదటి స్థానం) రూ.6వేలు, కె.అంజలి (రెండో స్థానం) రూ.5వేలను మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు.

## మున్నూరుకాపు కాపు సంఘం కన్వీనర్ల నియామకం





నియామకపత్రాన్ని అందుకుంటున్న చల్ల నరేందర్, దేమె యాదగిరి

రామాయంపేట/మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 20: రాష్ట్ర మున్నూరుకాపు సంఘం సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా రామాయంపేటకు చెందిన దేమె యాదగిరి, మున్నూరు కాపు సంఘం కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా మెదక్‌కు చెందిన చల్ల నరేందర్ నియామకమయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జోగు రామన్న, పీఎస్సీ సభ్యుడు విఠల్, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిప్రసాద్ వీరికి నియామక పత్రాలను అందజేశారు.

# కల్యాణలక్ష్మి ఆడబిడ్డలకు వరం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



మెదక్ మున్సిపాలిటీ: కల్యాణలక్ష్మి చెక్కును అందగజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



నిజాంపేటలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/మెదక్‌రూరల్, సెప్టెంబర్ 20: కల్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం అని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్‌లోని ద్వారక గార్డెన్‌లో పట్టణంతో పాటు మండలంలోని లబ్ధిదారులకు, నిజాంపేటలోని సబ్ మార్కెట్ యార్డులో మండలానికి చెందిన 78 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 9 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. హవేళీఘనపూర్‌లోని శ్రీనివాస గార్డెన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 71మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు లింగం, లక్ష్మి, రుక్మిణి, షమియొద్దీన్, లక్ష్మినారాయణగౌడ్, మాజీ కౌన్సిలర్లు జ్యోతి, మధుసూదన్‌రావు, నాయకులు శంకర్, దేవ్లా, హాఫీజొద్దీన్, మనోజ్, శివరామకృష్ణ పాల్గొన్నారు. నిజాంపేట ఎంపీడీవో రాజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, మాజీ ఎంపీపీ సిద్దిరాములు, మాజీ సర్పంచులు అమరసేనారెడ్డి, బాలయ్య, నాయకులు మహేందర్, నసీరొద్దీన్, మారుతి, మధుసూదన్‌రెడ్డి, రాంచందర్ నాయక్, మసూద్, రమేశ్, రవి ఉన్నారు.

# సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

- నీటి నిల్వలను తొలిగించాలి
- స్వచ్ఛతా హి సేవపై అవగాహన
- పరిసరాలు శుభ్రంగా ఉండాలి
- తడి పొడి చెత్తను డంపుయార్డుకు తరలించాలి



నిజాంపేటలో నీటి నిల్వలను పారిశుధ్య కార్మికులతో తొలిగింపజేస్తున్న మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య



రామాయంపేట: డి.ధర్మారం గ్రామంలో నీటినిల్వలను పరిశీలిస్తున్న ఎంపీడీవో షాజులుద్దీన్

నర్సాపూర్/నిజాంపేట/చిలిపిచెడ్/రామాయంపేట/మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 20: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా నీటి నిల్వల తొలిగించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. శుక్రవారం నిజాంపేట, చల్మెడలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డ్రై డే ఫ్రై డే నిర్వహించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. నర్సాపూర్ మండలంలోని పెద్ద చింతకుంట సమీపంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దామోదర్ తెలిపారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చిలిపిచెడ్ తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను డంపు యార్డులకు తరలించాలని రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్ తెలిపారు. డి.ధర్మారం గ్రామంలో డ్రైడే ఫ్రైడేలో భాగంగా గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని మెదక్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ అన్నారు.

## ఫ్రీ అని చెప్పి బస్సులు నిలిపేయడం అన్యాయం



ధర్నా చేస్తున్న నాగారం ప్రజలు, బీజేపీ నాయకులు

నర్సాపూర్, సెప్టెంబర్ 20: మహిళలకు ఫ్రీ బస్సులని చెప్పి బస్సులు నడపకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ఆరోపించారు. శుక్రవారం హత్నూరా మండలం నాగారం గ్రామానికి చెందిన గ్రామస్తులు , విద్యార్థులు నర్సాపూర్ బస్టాండ్ సమీపం లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వీరికి మద్దతుగా బీజేపీ నాయకులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నర్సాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారడంతో కొన్ని రోజుల నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపేసినట్లు తెలిపారు. దీంతో ప్రజలు, విద్యార్థులకు రవాణా సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని, అధికారులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రోడ్డు బాగు చేయించడం లేదన్నారు. అనంతరం డిపో అధికారికి అక్కడకు చేరుకోవడంతో వినతి పత్రాన్ని అందజేశారు. రాస్తారోకోలో నాయకులు చిన్న రమేశ్‌గౌడ్, రాజేందర్, రమణారావు, భరత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

## నగదు రహిత వైద్యం అందించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 20: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు దవాఖానల్లో నగదు రహిత వైద్యాన్ని అందించేలా ప్రభుత్వం కృషి చేయాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ పథకం అమలు చేసి కార్పొరేట్ దవాఖానల్లో నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. ప్రైవేటు ఇన్సూరెన్స్ తీసుకోవాలంటే కుటుంబ మొత్తానికి ఏడాదికి రూ.40 వేలకు పైగా ఖర్చు అవుతుందన్నారు.

## ఈ కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి

**-ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్**

మెదక్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులకు సంబంధించి కోట్లాది రూపాయలు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, ఈ వ్యవస్థను రద్దు చేసి గతంలో మాదిరిగా పెండింగ్ బిల్లులను సత్వరం మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా బాధ్యులతో కలిసి టేక్మాల్ మండలంలోని అచ్చన్నపల్లి, ఎలకుర్తి, కుసంగి, ధన్నూరా, బొడ్మట్‌పల్లి తదితర పాఠశాలలో సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు అరుణ్ కుమార్, సిద్ధార్థ శంకర్, టేక్మాల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, శ్రీధర్, నాయకులు శివ, సత్యం, సుభాష్, సాయి రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు స్థిర ఆదాయం వచ్చేలా చేయాలి

వెల్దుర్తి/మెదక్‌రూరల్/చేగుంట/అల్లాదుర్గం / పెద్దశంకరంపేట/చిలిపిచెడ్, సెప్టెంబర్ 20: మహిళలకు స్థిర ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో పథకాలు అమలు చేస్తున్నదని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్ తెలిపారు. శుక్రవారం వె ల్దుర్తి ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య 16వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడు తూ మహిళలు ప్రతి నెలా రూ.10 వేల నుం చి 30 వేల ఆదాయం వచ్చేలా ఆర్థిక వనరులు, ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలన్నా రు. అవసరమైన పథకాలను ప్రభుత్వం రూ పొందించి రుణ సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 130 శాతం బ్యాంకు లింకేజీ ఉండాలని, రుణాలు చెల్లించడంలో సంఘాలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. మహిళలు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

## తరగతి గదిలో దేశ భవిష్యత్ తయారు

చేగుంట, సెప్టెంబర్ 20: దేశ భవిష్యత్ తరగతి గది నుంచి మొదలవుతుందని, విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయుల కృషి ఉంటుందని ఎంపీడీవో చిన్నారెడ్డి అన్నారు. చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంఈవో బుచ్చనాయక్ అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులు అమరశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, దేవయ్య, గిరిధర్, కిషన్, దామోదర్, సునీత, శ్రీనివాస్, రాధ, సుధాకర్‌రెడ్డి, వేణు, నిర్మల, రాజశేఖర్‌రెడ్డి, అమరేశ్వరి, రేవతి, స్వరుపరాణి, శ్రీనివాస్, వెంకటేశ్, కవితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నీరజ, లీలావతి, కిషన్, నవాత్ సురేశ్ ఉన్నారు.

## కండ్లలో కారం కొట్టి పుస్తెల తాడు చోరీ

నర్సాపూర్, సెప్టెంబర్ 20: ఓ మహిళ కండ్లలో కారం కొట్టి పుస్తెల తాడును చోరీ చేసిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంతూర్ గ్రామానికి చెందిన లక్ష్మి కూరగాయలు కొనడానికి శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో నర్సాపూర్ మార్కెట్‌కు వచ్చింది. కూరగాయలు కొనుక్కొని వెళ్తున్న క్రమంలో ఓ గుర్తు తెలియని మహిళ లక్ష్మిని అనుసరిస్తూ వచ్చింది. వెనకాల నుంచి లక్ష్మి మొఖానికి కారం పూసి ఆమె మెడలోని 2 తులాల పుస్తెల తాడును అపహరించి, అక్కడి నుంచి పారిపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## వరుస దొంగతనాలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 20: వరుస దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మూడు నెలలుగా మెదక్‌లో వరుసగా ఫతేనగర్, జంబికుంట, దాయార కాలనీలలో దొంగతనాలు చేసిన హవేళీఘనపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మహేశ్‌కుమార్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. రూ.2 లక్షలు, 17.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



సత్యనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట, సెప్టెంబర్ 20 : మండ లంలోని దొంతి గ్రామంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్థానిక నాయకులతో కలసి శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పిట్ల సత్యానారాయణ కుటుంబాన్ని, ఇటీవల మృతిచెందిన బొద్దుల తులసమ్మ కుటుంబాన్ని, గొల్ల దేవిక కుటుంబాన్ని, హార్ట్ ఆపరేషన్ చేయించుకున్న బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చాకలి సత్యనారాయణను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, కోఆప్షన్ మాజీ సభ్యుడు లాయక్, మాజీ ఎంపీటీసీ కొదాసు లక్ష్మికుమార్, నాయకులు యాదాగౌడ్, సిలువేరి ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ కొదాస్ సత్యనారాయణ, ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ బొద్దుల భిక్షపతి, మగ్దుంపూర్ మాజీ సర్పంచ్ సోము అశోక్ ఉన్నారు.

## నమ్మించి నగల కోసం మహిళ హత్య



వివరాలను వెల్లడిస్తున్న తూప్రాన్ డీఎస్పీ ఇన్‌సెట్‌లో లలిత(ఫైల్)

చేగుంట, సెప్టెంబర్ 20: నగల కోసం మహిళను హత్యచేసిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెట్లతిమ్మాయిపల్లి సాజుతండాలో జరిగింది. చేగుంట పోలీస్ స్టేషన్‌లో తూప్రాన్ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సాజు తండాకు చెందిన మాలోత్ లలిత(48) ఈనెల 11న మాసాయిపేట బ్యాంకు నుంచి డబ్బులు తెచ్చేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. నాలుగు రోజులైనా తిరిగి రాలేదు. దీంతో మృతురాలి కూతురు జరుపుల దేవి చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారించగా తూప్రాన్ మండలం ఘనపూర్‌కు చెందిన వడ్డె కనకయ్య, ప్రమీల మృతురాలికి కల్లు దుకాణంలో పరిచయం ఏర్పడింది. మృతురాలి ఫోన్ నంబర్ తీసుకున్నారు. ఆమె ఒంటిపై ఉన్న నగలు కాజేయాలనే ఉద్దేశంతో ఈ నెల11న యాదగిరిగుట్టకు వెళ్లి వద్దామని ఫోన్ చేశారు. తూప్రాన్‌కు వచ్చిన లలితను వారి ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని యాదగిరి గుట్టకు వెళ్తూ జగదేవ్‌పూర్ దాటిన తరువాత పీర్లపల్లి అడవి ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు నులిమి హత్యచేశారు. ఆమె ఒంటిపై ఉన్న నగలు, వెండి కడియాలు, మట్టెలు, చెవి కమ్మలు, సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయారు. దొంగిలించిన సొమ్ము రూ.33వేలతో మరో బైకు కొన్నారు. చాకచక్యంగా ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. సీఐ వెంకట్‌రాజుగౌడ్, చేగుంట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి, హెచ్‌సీ సత్తయ్య, పీపీ భాస్కర్, గట్టేశ్, రమేశ్, మహేశ్, హోంగార్డు అర్షద్‌ను డీఎస్పీ వెంకట్‌రెడ్డి అభినందించారు.

## రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, సెప్టెంబర్ 20: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగ్గ కేసుల్లో కక్షిదారులు రాజీ కుదుర్చుకోవచ్చని, రాజీయే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి అనిత తెలిపారు. శుక్రవారం పోలీస్, బ్యాంకు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో ఏజీపీ పి.సుధాకర్, బార్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీ, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సైలు లింగం, మైపాల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మిస్బొద్దీన్, ఎక్సైజ్ ఎస్సై అరుణ, కోర్టు సూపరింటెండెంట్ పద్మావతి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ వేణు, న్యాయవాదులు స్వరూపరాణి, ప్రభు, రవి, సాయిరాం పాల్గొన్నారు.

## కాళేశ్వరంతో కాంగ్రెస్‌కు కనువిప్పు కలగాలి



శివ్వంపేట, సెప్టెంబర్ 20: నిండు కుండలా తలపిస్తున్న కాళేశ్వరాన్ని చూసి కాంగ్రెస్‌కు కనువిప్పు కలగాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలసి శివ్వంపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు.

## ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

శివ్వంపేట, సెప్టెంబర్ 20: వాష్ ఎన్‌జీవో సహకారంతో ఐటీసీ మిషన్ సునేహా కల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఘన, ద్రవ వ్యర్థాలపై పంచాయతీ కార్యదర్శిలు, మల్టీపర్పస్ కార్మికులకు ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తా అవగాహన కల్పించారు. సమాజ ఆరోగ్యాన్ని కాపాడడం, పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఘన, ద్రవస్థిరమైన వ్యర్థాలను శుద్ధిచేసి పారవేసేందుకు స్వచ్ఛంద సంస్థ చెబుతున్న పద్ధతులు అమలుచేయాలన్నారు. సునేహా కల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో అనిల్‌కుమార్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సాగర్, విజయ్, మెదక్ ఏపీఓ రాజేందర్ ఉన్నారు.

### 27న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 20: ఈనెల 27న ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ ప్రకటనలో తెలిపారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం ఆప్షనల్ సబ్జెక్టుగా చదివిన లేదా మైక్రో బయాలజీలో పీజీ చేసిన అభ్యర్థుల కోసం ఫార్మాసిటికల్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల 28 ఏండ్లలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7382929698 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### సీఎంఆర్‌ఎఫ్ అందజేత

నర్సాపూర్,సెప్టెంబర్ 20: నర్సాపూర్‌లోని ఏఆర్‌ఆర్ క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం అందజేశారు. కొల్చారం మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బాలమణికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60 వేల చెక్కు మంజూరైంది. ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నిజాంపేట, సెప్టెంబర్ 20: నిజాంపేటకు చెందిన గెరుగంటి కుమార్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి బీజేపీ నాయకుడు చల్మేటి నరేందర్ రూ.5వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యం అందజేశారు.

### కారుఢీకొని వ్యక్తి మృతి



కొల్చారం, సెప్టెంబర్ 20: కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతన్‌శెట్టిపల్లి హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పోతన్‌శెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల దుర్గమ్మ(56) మెదక్ నుంచి వస్తూ పోతన్‌శెట్టిపల్లి చౌరస్తా సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద దిగింది. వడ్డెకాలనీలోని తన ఇంటికి వెళ్తు రోడ్డు దాటే క్రమంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు బలంగా ఢీకొన్నది. దీంతో దుర్గమ్మ అక్కడికక్కడ మృతిచెందింది. స్థానికులు కొల్చారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై తారా సింగ్ ఘటనా స్థలానికి చేరుకుని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### ఎస్సీ, ఎస్టీ కేసులో 13 మందికి రిమాండ్



మనోహరాబాద్, సెప్టెంబర్ 20: మండలంలోని గౌతోజిగూడెంలో ఎస్సీ, ఎస్టీ కేసులో 13 మందిని రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. వీరిని విచారణ అనంతరం జ్యుడిషియ ల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మత్స్యకారుడు మృతి

పాపన్నపేట,సెప్టెంబర్20: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతిచెందిన ఘటన మండలంలోని మిన్పూర్‌లో శుక్రవారం జరిగింది. మిన్పూర్‌కు చెందిన నాయికోటి కేశయ్య (53) చేపలు పట్టడానికి చెరువులో వల వేశాడు. ఆ వల అతనికి చుట్టుకుని నీటమునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చేపట్టారు. మృతదేహం లభ్యమైంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580. NT-332617

వెంటనే కావలెను

★ వ్యవసాయ రంగంలో అనుభవం మరియు డ్రోన్ స్ప్రే యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించి ఒప్పించగలిగే నైపుణ్యం కలిగిన ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ప్రదేశం: సంగారెడ్డి, కామారెడ్డి, సం॥ సెల్: 9032527297. NTZ-334401

వెంటనే కావలెను

★ Small/Medium తరహా DGCA సర్టిఫికేట్ కలిగి ఉండి 1 సంవత్సరం అనుభవం కలిగిన అగ్రిడ్రోన్ పైలట్ కావలెను. విద్యార్హత: ఇంటర్మీడియట్/డిగ్రీ కలిగినవారు సంప్రదించండి. సెల్: 9032527297. NTZ-334402

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073. NT-331771-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.